www.samasamajam.in

# సమ సమాజం

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | బుధ వారం, 13 జూలై 2022 | ఎడిటర్: గోసుకొండ పృద్విరాజు | సంపుటి - 07, సంచిక-101 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# ఎడతెరిపి లేని వర్షాలతో తడిసిముద్ద

- నిండుకుండలా మారిన ప్రాజెక్టులు
- మత్తడి దుంకుతున్న చెరువులు
- భద్రాచలం వద్ద పెరుగుతున్న నీటిమట్టం
- దుమ్ముగూడెం వద్ద వంద కుటుంబాల తరలింపు
- ఉప్పొంగుతున్న మంజీన నది..జలదిగ్బంధంలో వలిమెల



**హైదరాబాద్, జూలై 12 (సమ సమాజం):** రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. ప్రాజెక్టుల్లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. గత నాలుగైదు రోజుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. తెలంగాణలోని ప్రాజెక్టులన్నీ నిండుకుండలా మారాయి. ఓవైపు వరద ఉధృతి.. మరోవైపు ఎగువన కురుస్తున్న వర్షాలతో వచ్చే ప్రవాహంతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. నిరంతరా యంగా కురుస్తున్న వానతో రాష్ట్రంలోని చెరువులు, కుంటలు మత్తడి దూకుతున్నాయి. ఎగువ ప్రాంతాలతో పాటు రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు ఉప్పొంగుతున్నాయి. గోదావరితో పాటు ఉపనదులు ఉరకలెత్తుతున్నాయి. ప్రాజెక్టులకు జలకళను సంతరించుకోగా.. చెరువులు, కుంటలు మత్తడి దూకుతున్నాయి. భారీ ప్రవాహంతో జలాశయాలు నిండుకుండలా మారటంతో.. గేట్లను ఎత్తి, నీటిని దిగువకు వదులుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో గోదావరి నీటిమట్టం వేగంగా పెరిగి ప్రస్తుతం నిలకడగా ప్రవహిస్తోంది. నీటిమట్టం 53అడుగులు దాటి ఉండడంతో.. మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. రాత్రి వరకు 53.9 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం.. ఉదయానికి ఐదు పాయింట్లు తగ్గింది. పెరిగిన గోదావరి నీటిమట్టం వల్ల భద్రాద్రి రామయ్య సన్నిధి వద్ద అన్నదాన సత్రం వద్దకు వరద నీరు చేరాయి.భద్రాచలంలోని లోతట్టు కాలనీలు మునిగిపోయాయి. అక్కడున్న వారిని అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. స్నానఘట్టాలు, కళ్యాణ కట్ట ప్రాంతం వరద నీటిలో పూర్తిగా మునిగిపోయాయి. భద్రాచలం నుంచి చర్ల, దుమ్ముగూడెం మండలాలతోపాటు.. దిగువన ఉన్న ముంపు మండలాల రోడ్లపైకి నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దుమ్ముగూడెం మండలంలోని సుమారు 100 కుటుంబాలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా కేంద్రంలో ఉట్నూర్, ఆదిలాబాద్ మధ్య రోడ్డుపై నీరు ప్రవహిస్తున్నది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. సాత్నాల, మత్తడి ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని అధికారులు బయటకు వదులుతున్నారు. అలాగే జయశంకర్ భూపాలపల్లి జిల్లా జిల్లాలో తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్నది. దీంతో రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరింది. సంగారెడ్డి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంజీర నది ఎగువతో పాటు పరీవాహక ప్రాంతాల్లో వర్షాలకు నదిలోకి వరద తరలివస్తున్నది. మోర్గీ వంతెన వద్ద మంజీర నది ఉరకలేస్తున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వర్షం దంచికొడుతున్నది. వానకు పలిమెల మండలం జలదిగ్బంధంలో చిక్కుకున్నది. పెద్దపేట వంతెన కొట్టుకుపోయి మహదేవ్‌పూర్ పలిమెల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సరఫరా లేక అవస్థలకు గురవుతున్నారు. నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కు వరద కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 62వేల 840 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా.. 20 గేట్ల ద్వారా 69వేల 450 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద కాలువ ద్వారా 14వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం వెయ్యి 87 అడుగుల నీటిమట్టం, 75 టీఎంసీల నీటి నిల్వ ఉంది.నిర్మల్ జిల్లా కడెం జలాశయంలోకి భారీగా వరద ప్రవహిస్తోంది. ప్రాజెక్టులకి లక్షా 40 వేల క్యూసెక్కుల వరద చేరుతుండడంతో.. 11 గేట్ల ద్వారా లక్షా 29వేలు దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులుకాగా.. ప్రస్తుతం 692 అడుగులకు చేరింది. సారంగాపూర్ మండలంలోని స్వర్ణ జలాశయానికి భారీగా వరద వచ్చి చేరుతోంది. జలాశయంలోకి 4వేల క్యూసెక్కుల వరద వస్తుండగా అంతే స్థాయిలో దిగువకు వదులుతున్నారు.

2వ



వ్యక్తులతో కొట్లాట మా మీడియా సంస్థకు ఉండదు. వ్యవస్థ మీద మా తిరుగుబాటు. పాలించే నాయకులు కర్త వ్యాన్ని ఆదమరిస్తే, పార్టీలు ఏవైనా ప్రశ్నించడం మా హక్కు. ఎంగిలి మెతుకులకు కక్కుర్తి పడేతత్వం కాదు, మీ నీతి మాలిన రాజకీయ నాయకుల మోచేతి నీళ్లు తాగే రకం అస్సలు కాదు. జర్నలిజం విలువలను తాకట్టుపెట్టి రోతలో ఏరుకుతినే అవసరం ఇక్కడ ఎవ్వరికి లేదు. కులం, మతం చూసి తక్కువ చేసి మాట్లాడితే ఖబర్దార్. పిల్ల చేష్టలు చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ఉంటే చూస్తూ ఊరుకునే పత్రిక కానే కాదు. ఇనాళ్లు ఓ లెక్క... ఇప్పుడు ఓ లెక్క. నికాసైన జర్నలిజం మా ఊపిరి. బతకనిస్తే న్యాయం... చంపేస్తే అన్యాయం. మా కలం అస్తమించే వరకు వాస్తవాలను ప్రచురిస్తాం. ఇక్కడ కావలిసింది సమ సమాజం. పీడత ప్రజలకోసం అండగా ఉండి అక్షర సత్యాన్ని ప్రజల ముందుకు తెచ్చి ప్రజాచైతన్యం వైపు అడుగులు వేయటమే మా "సమ సమాజం పత్రిక" ప్రధాన ధ్యేయం. - గోసుకొండ పృద్విరాజ్, ఎడిటర్

సమస్య ఏదైనా భాదితుల పక్షాన పోరాటానికి "సమ సమాజం" పత్రిక ఆయుధమౌతుంది. మా ప్రచురణల ద్వారా పరిష్కారం అవుతుందని నమ్మినట్లయితే సంప్రదించండి.

గమనిక : సమస్యను వాట్సప్ ద్వారా వివరాలను పంపండి.
వాట్సప్ నెం: 8985893382

## కొత్తగా 13,615 కొవిడ్ కేసులు నమోదు

### మరో 20 మంది మృతి చెందినట్లు ప్రకటన

**న్యూఢిల్లీ, జూలై 12 (సమ సమాజం):** దేశంలో కరోనా కేసుల సంఖ్య భారీగా తగ్గింది. అయినా దేశంలో కరోనా మహమ్మారి ఉధృతి కొనసాగుతున్నది.సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు 13,615 మంది వైరస్ బారినపడగా.. మరో 20మంది ప్రాణాలు కోల్పోయారు. కొవిడ్ నుంచి తాజాగా 13,265 మంది కోలుకున్నారు. మొత్తం కోలుకున్నవారి సంఖ్య 98.50 శాతానికి పడిపోయింది. రోజువారీ పాజిటివిటీ రేటు మాత్రం 3.23 శాతానికి తగ్గింది. గడిచిన 24 గంటల్లో 13,615 కొవిడ్ కేసులు నమోదయ్యాని కేంద్ర కుటుంబ ఆరోగ్యమంత్రిత్వ శాఖ తెలిపింది. తాజాగా 13,265 మంది బాధితులు కోలుకోగా.. మహమ్మారి కారణంగా మరో 20 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం దేశంలో 1,31,043 యాక్టివ్ కేసులున్నాయి. రోజువారీ పాజిటివిటీ రేటు 3.23శాతంగా ఉన్నది. తాజాగా నమోదైన కేసులతో 4,36,52,944కు చేరింది. ఇందులో 4,29,96,427 మంది కోలుకున్నారు. 5,25,474 మంది ప్రాణాలు కోల్పోయారు. దేశంలో కరోనా వ్యాక్సినేషన్ కొనసాగుతున్నది. ఇప్పటి వరకు 1,99,00,59,536 డోసులు వేసినట్లు ఆరోగ్యమంత్రిత్వ శాఖ వివరించింది.

## వర్షాలతో సీజనల్ వ్యాధులు

- అప్రమత్తంగా ఉండాలన్న వైద్యారోగ్యశాఖ
- డెంగ్యూతో పాటు, మలేరియా వ్యాప్తి చెందే అవకాశాలు
- హెచ్చరికలు చేసిన హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు



**హైదరాబాద్, జూలై 12 (సమ సమాజం):** వర్షాలతో ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ డీహెచ్ శ్రీనివాసరావు సూచించా రు. సీజనల్ వ్యాధులు రాకుండా ఉండాలంటే వ్యక్తిగత జాగ్రత్తలు తప్పనిసరి అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్న డీహెచ్.. కరోనా తగ్గాక డెంగీ కేసులు అధికంగా వస్తున్నాయన్నారు. దోమలు, అపరిశుభ్రవాతావరణం తో డెంగీ కేసులు పెరుగుతున్నా యని చెప్పారు. నీరు, ఆహారం కలుషితమైతే విషజ్వరాలు వస్తున్నాయని తెలిపారు. ఈ ఏడాది డెంగీతో పాటు టైఫాయిడ్ కేసులు పెరిగాయన్న డీహెచ్.. రాష్ట్ర వ్యాప్తంగా టైఫాయిడ్, డెంగీ కేసులు

2వ

## రాష్ట్రంలో డ్రగ్స్ నిరోదానికి కఠిన చర్యలు

పోలీసు శాఖకు ఆధునిక పరికరాలను అందజేస్తాం • ఉన్నతస్థాయి సమీక్షలో సిఎస్ సోమేశ్ కుమార్



హైదరాబాద్,జూలై12(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో డ్రగ్స్ వినియోగాన్ని, అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ స్పష్టం చేశారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల రవాణాను గుర్తించేందుకు పోలీసు శాఖకు ఆధునిక పరికరాలను అందజేస్తామని సీఎస్ ప్రకటించారు. డ్రగ్స్ అక్రమ రవాణాను నిరోధించాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు.. మంగళవారం ఉదయం బీఆర్కే భవన్‌లో సీఎస్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిరోధక కమిటీ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎస్ సోమేశ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధంపై ఇప్పటికే సీఎం కేసీఆర్ పలు మార్లు ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో గంజాయి సాగు చేసే రైతులకు రైతుబంధు పథకాన్ని నిలిపివేస్తూ ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. పోలీస్ శాఖ, ఎక్సైజ్, ఆటవీ, గిరిజన సంక్షేమం, రెవెన్యూ శాఖలు కలిసి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం పై సమన్వయంతో పనిచేస్తున్నాయని వెల్లడించారు. మాదక ద్రవ్యాల వినియోగ నివారణ ఉన్నతస్థాయి కమిటీ సమావేశం ప్రతీ మూడు నెలలకు ఒక సారి జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాగా, ప్రతీ జిల్లాతో పాటు పోలీస్ కమిషనరేట్ లలో మాదక ద్రవ్యాల నిరోధక సెల్‌లను ఏర్పాటు చేశామని డీజీపీ

3వ

## సంక్షోభం నుంచి లంక గట్టెక్కేనా

ప్రపంచం చేయూత లేకుండా మనుగడ కష్టమే • రణిల్ విక్రమ్ సింఘే సమర్థతపైనే ఆధారం



**కొలంబో, జూలై 12 (సమ సమాజం):** ఒకసారి పతనమంటూ మొదలైతే అది ఎంతవరకూ వెళుతుందో, ఆ ప్రభావం ఎన్ని రీతుల్లో ఉంటుందో చెప్పడం కష్టం. అనేక గొలుసుకట్టు పరిణామాలతో శ్రీలంక సంక్షోభం నానాటికీ ముదిరిపోతున్నది. ఈ అష్టకష్టాల నుంచి లంకను కచ్చితంగా బయటపడ వేస్తానని కొత్త ప్రధాని రణిల్ విక్రమసింఘే బలంగా చెబుతున్నా..ఇప్పటికిప్పుడు లంక కోలుకోవడం కష్టమే. రావణ కాష్టం అని ఎందుకన్నామో కానీ అక్కడ ఇప్పుడు జరుగుతున్నది అదే. పార్లమెంటులో ఒకే ఒక్కస్థానం ఉన్న యునైటెడ్ నేషనల్ పార్టీ (యుఎన్‌పి) నాయకుడు రణిల్ విక్రమసింఘే ఆ దేశ కొత్త ప్రధానిగా ప్రమాణం చేశాక ఇప్పటికిప్పుడు పరిస్థితి చక్కబడదని కూడా తేలిపోయింది. గోటబయ రాజపక్స సోదరుడు మహీంద రాజపక్స ప్రధానమంత్రి పదవినుంచి కఠినమైన పరిస్థితుల మధ్య తప్పుకోవాల్సి వచ్చింది. తాజాగా అధ్యక్షుడు అధ్యక్షుడు కూడా పారిపోయాడు. ప్రజలు దాడులు చేసి పరిస్థితులను మరింత ఉద్రిక్తంగా మార్చారు. రాజపక్సలందరూ కలసి దేశాన్ని ముంచేశారన్న ప్రజాగ్రహాన్ని చల్లార్చే ఉద్దేశంతో కొందరు సోదరులు పదవులు వదిలినా అధ్యక్షస్థానంలో ఉన్న గోటబయ మాత్రం కొనసాగడానికి పాచిక వేశారు. అయితే ప్రజలు దాడి చేయడంతో పలాచయనం చిత్తగించాడు. అందరితో కలసిపనిచేస్తానని రణిల్ అంటున్నప్పటికీ, ఆయన నియామకాన్ని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. ఆయనతో రాజకీయంగా పడక పార్టీనుంచి సీనియర్లంతా రెండేళ్ళక్రితం విడిపోయి ఇప్పుడు ప్రధానప్రతిపక్షంగా కూర్చున్నారు. జయవర్ధనే కాలంనుంచి కీలక పదవులు చేపట్టిన రణిల్‌కు సమర్థుడన్న పేరు ఉంది. ఈ సంక్షోభకాలంలో భారతదేశం నుంచి, అంతర్జాతీయ సమాజంనుంచీ సహకారాన్ని సాధించడానికి రణిల్ ఉపకరిస్తాడని అంటున్నారు. దాదాపు అరడజనుసార్లు ప్రధానిగా ఉన్న రణిల్ అంతర్జాతీయ ఆర్థిక సంస్థలతో లావాదేవీలు జరపడంలో దిట్ట. రణిల్ అద్భుతాలు చేయలేకపోవచ్చు కానీ, ప్రజల్లో కొంత విశ్వాసాన్ని నింపవచ్చు. దేశం క్లిష్టపరిస్థితుల్లో ఉండగా మధ్యేమార్గంగా ప్రతిపాదనలు చేస్తున్నారు. అధ్యక్షుడి తొలగింపు విషయాన్ని అటుంచితే, అఖిలపక్ష ప్రభుత్వం ఏర్పాటుకు వీలున్నది కనుక ఇప్పుడు ఆ దిశగా అడుగులుపడుతున్నాయి. ఒకదశలో లంకలో సైనిక తిరుగుబాటు వస్తుందన్న విశ్లేషణలు కూడా వినిపించాయి. ప్రజాందోళనలను నియంత్రించలేని స్థితిలో సైన్యానికి విస్తృతాధికారాలు దఖలు పరిచిన గోటబయ ఈ విషయంలో తప్పటడుగులు వేసారనే చెప్పాలి. శ్రీలంక ఆర్థిక సంక్షోభానికి రాజపక్స సోదరులు మాత్రమే కారకులు. ఇందులో ఎలాంటి సందేహం అక్కర్లేదు. గతంలో మహీంద రాజపక్స దేశాధ్యక్షుడిగా ఉన్నప్పుడు చైనానుంచి అతిగా అప్పులు తెచ్చి,

3వ

## హైదరాబాద్ ట్రిపుల్ ఐటి బెస్ట్: కెటీఆర్



**హైదరాబాద్, జూలై 12 (సమ సమాజం):** దేశంలోనే వన్ ఆఫ్ ది బెస్ట్ ఇనిస్టిట్యూట్... ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ అని మంత్రి కేటీఆర్ అన్నారు. గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పాప్యులేషన్ స్కేల్ ప్రోగ్రాం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. ట్రిపుల్ ఐటీకి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామన్నారు. రోడ్ సేఫ్టీ కోసం సహాయం అందిస్తున్న ఇంటెల్ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. కామన్ మ్యాన్ ని ఉపయోగపడే టెక్నాలజీని తీసుకురావాలని సీఎం చెబుతూ ఉంటారన్నారు కేటీఆర్. అగ్రికల్చర్ సెక్టార్ లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ని తీసుకొస్తున్నామని చెప్పారు. సిరిసిల్ల లోని వీరన్నపల్లి గ్రామంలో టెక్నాలజీతో కూడిన మాడ్యూల్స్ ని వాడుతున్నారని మంత్రి కేటీఆర్ తెలిపారు.

## డబుల్ ఇళ్ళు వెంటనే కేటాయించాలి

జిహెచ్ఎంసి ముందు సిపిఎం ఆందోళన

**హైదరాబాద్, జూలై 12 (సమ సమాజం):** డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్దిదారులకు కేటాయించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ముందు లబ్దిదారులతో కలిసి సీపీఎం పార్టీ ధర్నా చేపట్టింది. లబ్దిదారులను గుర్తించేందుకు సర్వే చేపట్టాలని సీపీఎం నేతలు అన్నారు. 6 ఏళ్ల క్రితం డబల్ బెడ్ రూం ఇల్లు ఇస్తామని చెప్పిన హామీని వెంటనే నెరవేర్చలని వారు తెలిపారు. లేదంటే లబ్దిదారులతో కలిసి ప్రగతి భవన్ ను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. కొత్త దరఖాస్తులను మళ్లీ తీసుకోవాలని.. అప్లై చేసుకోని వారుకి అవకాశం ఇవ్వాలని మహిళలు డిమాండ్ చేశారు.

## సంపాదకీయం

### శ్రీలంకను చూసైనా...తెలుగు వల్లభులు కళ్లు తెరవాలి !

శ్రీలంక వ్యవహారం మరోమారు ప్రపంచం ముందు కదలాడుతోంది. ప్రజల తిరుగుబాటుతో అధ్యక్షుడు గొటబయ రాజపక్సె పారిపోవడం అక్కడి దారుణ పరిస్థితులకు, ప్రజల ఆందోళనలకు అద్దం పట్టింది. చేతకానివారు, అసమర్థులు, దూరదృష్టి లేనివారు గద్దెనెక్కితే ఇలాగే జరుగుతుంది. అలాగే అధికారం కోసం నానాగడ్డి కరిచేవారు ఉంటే శ్రీలకం లాంటి పరిస్థితులు ఎదుర్కోక తప్పదని రుజువయ్యింది. ఒక్క కుటుంబం చేతిలోనే దేశాధికారం కేంద్రీకృతం కావడం కూడా ఇక్కడ గమనించాలి. దేశ సంపదను కొల్లగొట్టి, ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసి ఆర్థిక మాంద్యానికి కారణమవుతున్న నేతలకు ఇది కనువిప్పు కావాలి. శ్రీలంక పరిణామాలు మననేతలకు కూడా కనువిప్పు కావాలి. ముఖ్యంగా ఉభయతెలుగు రాష్ట్ర వల్లభులు దీనిపై పాఠాలు నేర్చుకోవాలి. జీతాలకు ఇవ్వలేక, అభివృద్ధి పనులు చేపట్టలేక, ఉన్నది ఉచితంగా దోచిపెడుతూ తామేదో ఘనకార్యం చేస్తున్నామనుకుంటున్న కెసిఆర్, జగన్‌లో కళ్లు తెరవాలి. పాలన అంటే పంచిపెట్టడం కాదని గుర్తించాలి. నగదు బదిలీలతో ప్రజలను మచ్చికచేసుకుని ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ కుటుంబం గుప్పిట్లో అధికారాన్ని ఉంచుకుని చేస్తున్న యత్నాలు విరమించుకోవాలి. ఉచిత పథకాల పై నెత్తీనోరు మొత్తుకుంటున్నా ఇద్దరు సిఎంలు వాటిని ఆపాలని ప్రయత్నించడం లేదు సరికదా అదేదో మహత్కార్యం చేసినట్లుగా ఫీల్ అవుతున్నారు. ఇంకా ఆలస్యం చేయకుండా ఉభయతెలుగు రాష్ట్రాల్లో ఉచిత పథకాలపై కత్తెర వేయాలి. డబ్బుల పంపిణీని ఆపాలి. లేకుంటా నిజంగానే శ్రీలంక కన్నా దారుణ పరిస్థితులు ఏర్పడగలవు. ఇలాంటి పరిస్థితు కారణంగానే శ్రీలంకలో ప్రజాతిరుగుబాటు తప్పలేదు. ప్రజలు దోచిపెట్టినంత కాలం తింటారు. ఉపద్రవం ముంచుకొస్తే తిరగబడతారనడానికి శ్రీలంక చక్కని ఉదాహరణ. శ్రీలంకలో అంతర్యుద్ధం ముగిశాక, గత మూడు దశాబ్దాలుగా దేశ రాజకీయాలను రాజపక్సీయులే శాసించారు. ఒక దశలో ప్రభుత్వంలో, ప్రభుత్వరంగ సంస్థల్లో ఏకంగా 40 మంది రాజపక్స కుటుంబ సభ్యులు, బంధువులే ఉన్నట్లు తెలుస్తోంది. అలా ఆర్థిక వ్యవస్థను గుప్పెట పెట్టుకొని, యథేచ్ఛగా వ్యవహరించి దేశానికి ఈ గతి పట్టించారు. అన్ని అధికారాలూ అధ్యక్షుడికే కట్టబెట్టే ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెన్సీ పద్ధతి తెచ్చి, రాజపక్స నిరంకుశత్వానికి బాటలు వేశారు. నిజానికి ప్రజలు తిరుగుబాటు చేశాకనే వారు ఎంత అవినీతిపరులో, ఎంతగా ఆస్తులు కూడబెట్టుకుని విలాసాలకు అలవాటు పడ్డారో ప్రపంచానికి తెలిసింది. సంక్షోభం ముంచుకు రావడం, ఇంధనం దొరక్కపోవడం, పాలు,కూరగాయలకు కూడా కటకట తప్పకపోవడం వంటి పరిస్థితులతో ప్రజలు తిరుగుబాటు చేయడంతో పాలకులు పారిపోయారు. శ్రీలంక అధ్యక్షభవనం,ప్రధాన మంత్రి నివాసాల ప్రజా దిగ్బంధం, బయటపడ్డ బంకర్లు ,నోట్లకట్టలు, ప్రజలు అందులో సేదదీరుతున్న దృశ్యాలు చూస్తే పరిస్థితి అర్థం అవుతుంది. జూలై 9 నుంచి శ్రీలంక వీధుల్లో నిరసనకు దిగిన ప్రజా సమూహ సన్నివేశాలు కొన్నేళ్ళ క్రితం అరబ్ దేశాల్లో వీధికెక్కిన ప్రజాగ్రహంతో నేతలు పలాయనం చిత్తగించారు. ఆచూకీ లేకుండా పరారైన దేశాధ్యక్షుడు గొటబయ రాజపక్స, వ్యక్తిగత నివాసం జనాగ్రహంలో దగ్ధమైన ప్రధాని రణిల్ విక్రమసింఘే గద్దె దిగుతామంటున్నారు. సమష్టి మధ్యంతర ప్రభుత్వ ప్రయత్నాలు సాగుతున్నాయి. సరిగ్గా రెండు నెలల క్రితం మే 9న ఇలాగే ప్రజాగ్రహం పెల్లుబికి, హింసాకాండ చెలరేగి, ప్రధానమంత్రి మహిందా రాజపక్స గద్దెదె దిగి, ప్రాణాలు దక్కించుకున్నారు. ముళ్ళ కిరీటం లాంటి ప్రధాని పదవిని రణిల్ చేపట్టారు. తనకున్న పేరుతో సంప్రతింపులు సుగమం అవుతాయనీ, సులభంగా దేశానికి అప్పు పుడుతుందనీ భావించారు. ఇంతలో కరెంట్, పెట్రోల్, ఆహారం సహా అన్నిటికీ కొరతతో సామాన్య జనజీవితం అతలాకుతలం అయ్యింది. డంతో జనంలో అసహనం, కోపం కట్టలు తెంచుకొని, రెండే నెలల్లో మరోసారి వీధికెక్కి అవినీతి గొటబయతో పాటు ఆపద్ధర్మంగా వచ్చిన విక్రమ సింఘేకూ ఇంటిదారి చూపెట్టారు. రాజపక్సీయుల అసమర్థ ఆర్థిక నిర్వహణతో విదేశీ రుణభారం మోయ లేనిదైంది. కరోనాతో ఆ దేశ ప్రధాన ఆదాయ వనరైన పర్యాటకం దెబ్బతింటే, తాజా ఉక్రెయిన్ యుద్ధం సంక్షోభాన్ని తీవ్రతరం చేసింది. శ్రీలంకలో పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉందంటే, ద్రవ్యోల్బణం 50 శాతానికి చేరింది. రూపాయి విలువ డాలర్‌కు 350 స్థాయికి పడిపోయింది. స్కూళ్ళు, ఆఫీసులు మూత బడ్డాయి. ఆసుపత్రుల్లో మందులు అడుగంటాయి. రెండు నెలల క్రితం సోదరుడు మహిందా వైదొలగాల్సి వచ్చినప్పుడే అధ్యక్షుడు గొటబయ కూడా తప్పుకొని, దేశంలో మార్పునకు దోహద పడాల్సింది. ప్రజా గ్రహం చల్లార్చాల్సింది. అలా కాక కుర్చీ పట్టుకు వేలాడి చివరకు గత్యంతరం లేకపోవడంతో పారిపో యాడు. ప్రస్తుత ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని గ్టటెక్కించే నిఖార్సయిన ప్రభుత్వం. దేశప్రయోజనాలే లక్ష్యంగా... సింహళాన్ని మళ్ళీ పట్టాలెక్కించే అంకితభావమున్న అనుభవజ్ఞులు కావాలి. మరోపక్క సింహళం మళ్ళీ పర్యాటకులను ఆకర్షించాలన్నా, విదేశాల నుంచి ఆర్థికసాయం,పెట్టుబడులు రావాలన్నా... ముందుగా అక్కడ విశ్వసనీయ ప్రభుత్వం రావాలి. ప్రజాకర్షక పథకాలకు బ్రేకులు వేసైనా దేశాన్ని గాడిలో పెట్టాలి. అలా పని చేసే ప్రభుత్వం వస్తేనే, దాన్ని ప్రజలూ పని చేయనిస్తేనే... క్రమంగా ఫలితం కనిపి స్తుంది. లేదంటే మళ్ళీ ఆగ్రహావేశాలు అదుపు తప్పుతాయి. శ్రీలంక చెబుతున్న పాఠం నుంచి మనమంతా గుణపాఠం నేర్వాలి. ప్రజలు పన్నుల రూపంలో కడుతున్న డబ్బులను పందేరం చేస్తున్న కెసిఆర్,జగన్‌లు కళ్లు తెరవాలి. ఇబ్బడిముబ్బడిగా పోటీపడి కొనసాగిస్తున్న ఉచిత పథకాలను రద్దు చేయాలి. రైతుబంధు పేరుతో డబ్బున్న వారికి పంపిణీ చేస్తున్న కార్యక్రమాన్ని తక్షణం ఆపాలి. రైతుబంధు, రైతుల రుణ మాఫీలు, ఉచిత్ గొర్రెల పథకం, దళితబంధు వంటి పథకాలను తక్షణం సమీక్షించాలి. వీటిగురించి గొప్పలు చెప్పడం మానుకోవాలి. విపక్షాలు కూడా ఈ పథకాలపై చర్చించి దుబారాను అరికట్టాలని కోరాలి. లేకుంటే వారు కూడా ఇందుకు బాధ్యతులు కాగలరు. జగనన్న పేరుతో చేస్తున్న దుబారాలను అరికట్టాలి. నగదు బదిలీలతో బొక్కసం ఖాళీచేయడం ఆపాలి. లేకుండా మనం కూడా శ్రీలంక లాంటి దారుణాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

## కామారెడ్డి ఘటనపై సిఎం కేసీఆర్, మంత్రి దిగ్భ్రాంతి

### మృతుల కుటుంబాలకు 3లక్షల చొప్పన పరిహారం

**నిజామాబాద్, జూలై 12 (సమ సమాజం):** కామారెడ్డి జిల్లా కేంద్రంలో బీడీ వర్కర్స్ కాలనీలో విద్యుత్ షాక్‌తో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందిన ఘటన కలచివేసింది. ఈ ఘటన పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే గంప గోవర్ధన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సీఎం కేసీఆర్, మంత్రి ప్రశాంత్ రెడ్డి.. అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్న హైమద్ (35),అతని భార్య పర్వీన్(30), కుమారుడు అద్నాన్ (4), కూతురు మాహిమ్(6)ల మృతి చాలా బాధాకరం అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కామారెడ్డి ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పరామర్శిం చారు. మృతులకు ఒక్కొక్కరికి రూ. 3 లక్షల చొప్పున సీఎం కేసీఆర్ ఆర్థిక సాయం ప్రకటించారని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి వెల్లడించారు. ఒకే కుటుంబంలో నలుగురు చనిపోయిన వార్త విని.. కేసీఆర్ చలించిపోయారని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా క్షేత్ర స్థాయిలో అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు. విషయం తెలుసుకున్న వెంటనే మానవతా దృక్పథంతో మృతులకు రూ. 3 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించిన ముఖ్యమంత్రికి మంత్రి వేముల ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

- గుజరాత్, మహారాష్ట్రల్లో వర్షబీభత్సం
- కేరళలో జోరువానలతో అతలాకుతలం
- సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ప్రమాద దృశ్యాలు



**న్యూఢిల్లీ, జూలై 12 (సమ సమాజం):** దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కురుస్తోన్న భారీ వర్షాలు బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. నదులు, వాగులు, వంకలు ఉరకలేస్తున్నాయి. రోడ్లపై వరదనీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. ఈదురుగాలులు, జడివానల దెబ్బకు భారీ చెట్లు, కరెంటు స్తంభాలు నేలకొరుగుతున్నాయి. న్యూఢిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, హర్యానా.కేరళలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవనున్నట్లు వాతావారణ శాఖ వెల్లడించింది. ప్రతికూల వాతావరణం కారణంగా ... విమాన రాకపోకలపై ప్రభావం పడొచ్చని విమానయాన సంస్థ స్పైస్ జెట్ వెల్లడించింది. వర్షాల బీభత్సాన్ని చూపుతూ ... కొన్ని ప్రాంతాల్లో కార్లు నీట మునిగినట్లు, రోడ్డు కుంగినట్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి..! భారీ వర్షాల కారణంగా గుజరాత్ అతలాకుతలమయ్యింది. 24 గంటల వ్యవధిలో గుజరాత్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తోన్న వర్షాల కారణంగా గోడ కూలి ఎనిమిదిమంది మరణించారు. అహ్మదాబాద్, రాజ్‌కోట్ సహా పలు ప్రాంతాల్లో వరద పోటెత్తింది. ఉరుములు, వరదనీటిలో కొట్టుకొని పోవడం, చెట్లు, కరెంటు స్తంభాలు కూలడం సహా పలు ఘటనల్లో మొత్తంగా 64 మంది మరణించినట్లు అధికారులు వెల్లడించారు. ముంబయికి గురువారం వరకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మహారాష్ట్రలో మొత్తం 27 జిల్లాలు, 236 గ్రామాలపై ఈ వర్ష ప్రభావం తీవ్రంగా పడింది. పలు ప్రాంతాల్లో రానున్న కొద్ది గంటల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణశాఖ వెల్లడించింది. ఇప్పటివరకూ 5,873 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. కేరళలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కేరళలోని కన్నూర్‌లో కుండపోత వర్షం కురుస్తోంది. అయితే ఈ వరద నీటిలో ఓ జీపు చిక్కుకుపోయింది. ఆ జీపును బయటికి తీసేందుకు స్థానికులు తీవ్రంగా ప్రయత్నించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక కేరళలో రానున్న ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. కేరళ తీరంలో గంటకు 65 కి.మీ వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరికలు తెలియజేసింది. త్రిసూర్, మలప్పురం, కోజికోడ్, వాయనాడ్, కన్నూర్, కాసర్‌గోడ్ జిల్లాలతో సహా ఆరు జిల్లాల్లో ఎల్లో అలర్ట్ ను అధికారులు ప్రకటించారు.

## వరదల పరిస్థితిపై మంత్రి సమీక్ష

### కలెక్టరేట్‌లో అధికారులకు దిశానిర్దేశం



**నిర్మల్, జూలై 12 (సమ సమాజం):** గతమూడు రోజులుగా క్షేత్రస్థాయిలో వరదలను పరిశీలించిన అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అధికారులతో నేరుగా సమీక్షించారు. జిల్లాలో భారీ వర్షాల కారణంగా కలిగిన నష్టాలపై జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. వరదల వల్ల ముంపుకు గురైన ప్రాంతాల పరిస్థితిని, పంట నష్టం, పునరావాస ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ, ఆర్అండ్ బీ విద్యుత్ శాఖ, పంచాయితీ రాజ్, రెవెన్యూ శాఖల పరిధిలో జరిగిన నష్టం వివరాలు తెలుసుకున్నారు. ఆయా శాఖల పరిధిలో జరిగిన నష్టం వివరాలు, అంచనాలతో ప్రాథమిక నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలతో తలెత్తిన పరిస్థితి, ప్రస్తుతం తీసుకున్న పునరావాస చర్యలు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశర చేశారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు కొనసాగే సూచనలు ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలోని జలాశయాల్లో ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీశారు. ప్రాజెక్ట్ లలోకి వచ్చి చేరుతున్న వరదను ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలని, ఇన్ ఫ్లోను బట్టి నీటిని బయటకు వదిలేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లను వెంటనే పునరుద్ధరించాలని, చెరువులు, కాలువల గండ్లను పూడ్చాలని ఆదేశించారు. అన్నిశాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి, పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో జడ్పీ చైర్ పర్సన్ కె. విజయలక్ష్మి రెడ్డి, ముదోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, కలెక్టర్ ముశ్రాఫ్ అలీ ఫారూఖీ, ఎస్పీ ప్రవీణ్ కుమార్, నీటిపారుదల, మున్సిపల్, పంచాయతీ, వ్యవసాయ, ఇతర సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు.

## ఎడతెరిపి లేని వర్షాలతో తడిసిముద్ద

(మొదటి పేజీ తరువాయి..) జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 11వందల 83 అడుగులు కాగా ప్రస్తుతంస నీటిమట్టం 11వందల 79 అడుగులు చేరింది. ఇదిలా ఉండగా.. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, ములుగు జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేటతో పాటు పలు జిల్లాల్లో మోస్తరు వర్షాపాతం నమోదైంది. అత్యధికంగా కుమ్రంభీం జిల్లా కెరిమెరిలో 17 సెంటీమీటర్ల వర్షం కురిసింది. హైదరాబాద్ జంట జలాశయాల్లోకి వరద కొనసాగుతోంది. ఉస్మాన్‌సాగర్‌కు 250 క్యూసెక్కుల వరద వస్తుండగా.. రెండు గేట్ల ద్వారా 312 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. ఉస్మాన్‌సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 1790 అడుగులుకాగా.. ప్రస్తుత నీటి మట్టం 17వందల 86 అడుగులు ఉంది.హిమాయత్‌సాగర్‌కు 500 క్యూసెక్కుల వరద ప్రవహిస్తుండగా.. రెండు గేట్ల ద్వారా 515 క్యూసెక్కులు మూసీలోకి విడుదల చేశారు. హిమాయత్‌సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1763.50 అడుగులుకాగా.. ప్రస్తుత నీటిమట్టం 1760.55 అడుగులు ఉంది. హుస్సేన్‌సాగర్‌కు వరద ప్రవాహం కొనసాగుతోంది. హుస్సేన్‌సాగర్‌కు 513.41 మీటర్లు వస్తున్న నీటికి సమానంగా తూముల ద్వారా బయటకి వెళ్తున్నాయి.





# కాంగ్రెస్ పార్టీకి పక్కలో బల్లెం

## త్వరలో జంపింగ్‌కు సిద్ధమౌతున్న ఎమ్మెల్యే ?

### మునుగోడు నియోజకవర్గంలో కోమటిరెడ్డి పై సన్నగిల్లుతున్న జనాదరణ

ఓ ... ఎమ్మెల్యే హామీలపై మునుగోడు ప్రజలకు వివరణ ఇవ్వు

**టీ.కాంగ్రెస్‌కు తూట్లు పొడుస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి**

ప్రస్తుతం ప్రజలలో ఆదరణ ఉన్న పార్టీ బీజేపీ పార్టీ అని బాష్యం చెప్పిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బీజేపీ పార్టీని సమర్థిస్తూ మాట్లాడిన మాటలు టీ కాంగ్రెస్‌కు ఇబ్బందిపెట్టే అంశాలుగా మారాయి. అంతటితో ఆగకుండా భవిష్యత్తులో తాను బీజేపీలో చేరే అవకాశం ఉందని ప్రకటించిన కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన సొంత పార్టీకి పక్కలో బల్లెంలా మారారు. ఇప్పటికే తెలంగాణలో చతికిలపడ్డ కాంగ్రెస్‌కు అవకాశం వచ్చినప్పుడల్లా ఆ పార్టీ టీపీసీసీ ప్రసిడెంట్ రేవంత్‌రెడ్డి ప్రతిపక్షాలను తనదైన శైలిలో ఉతికి ఆరేస్తున్నారు. ఇలాంటి తరుణంలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్తుతిమించి మాట్లాడుతున్నాడని ఆ పార్టీ వర్గాలు గుసుక్కోవడం, క్రమంగా ఆ పార్టీలో ఆదరణ కరువౌతుంది.

**నల్లగొండ, జూలై 12(సమ సమాజం):** ప్రజలకు ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలను పట్టించుకోకుండా, మునుగోడు నియోజక వర్గం వైపు కన్నెత్తి చూడకుండా తనకు పట్టనట్టు వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే తీరుపై ప్రజలు గుర్రుగా ఉన్నారు. ఈ క్రమంలో మునుగోడు నియోజక వర్గంలో కోమటిరెడ్డిపై సన్నగిల్లుతున్న జన ఆదరణకు కోమటిరెడ్డి సంచలన నిర్ణయం తీసుకోబోతున్నట్లు తెలుస్తుంది. తన స్వార్థపూరిత ఆలోచనతో వివిధ పార్టీలతో చర్చలు జరుపుతూ.., త్వరలో పార్టీ మారేందుకు సిద్ధమౌతున్నట్లు విశ్వస నీయ వర్గాల సమాచారం. నమ్మిన క్యాడర్‌ను నట్టేట ముంచి తన స్వలాభం కోసం పార్టీని వీడి వెళ్లేందుకు రంగం సిద్ధం అవుతున్నట్లు తెలవడంతో మునుగోడు నియోజకవర్గ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకత్వంలో కలవరపాటు మొదలైంది.

రేవంత్‌రెడ్డి టీపీసీసీ పదవిని స్వీకరించి సంవత్సరం పూర్తి అయ్యిన సందర్భంగా జూబ్లిహిల్స్ క్లబ్‌లో టీ.కాంగ్రెస్ ప్రముఖ నాయకులు విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కోమటిరెడ్డి బ్రదర్స్ హాజరు కాకపోవడం గమన్హాం. గత కొంత కాలంగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి అంటముట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

**ఎన్నికల సమయంలో మునుగోడు మండలానికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఇచ్చిన హామీలు**

- మునుగోడు పట్టణ కేంద్రంలో గల రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి స్ట్రీట్ లైట్లు ఏర్పాటు.
- నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతిలు వెలగలగూడెం, రావిగూడెం, గుండ్లోరిగూడెం, జక్కలవారిగూడెం, గంగోరిగూడెం గ్రామాలను ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి, రోడ్లు, మురికి కాలువలు, వీధిలైట్లు, వాటర్ ప్లాంట్లు ఏర్పాటు.
- పట్టణ కేంద్రంలో ముఖ్యమైన సమస్య అయినటువంటి మురికి కాలువల నిర్మాణం .
- కిష్టాపురం చెరువు నుండి ఇప్పర్తి, తాళ్ళవెల్లంల, ఊకొండి చెరువుల మీదుగా మునుగోడు పెద్దచెరువులోకి ఫీడర్ ఛానెల్ మరమత్తు
- పుట్టపాక చెరువు నుండి కొంపెల్లి చెరువులోకి ఫీడర్ ఛానెల్ నిర్మాణం
- మునుగోడు పెద్దవాగు నుండి వెలగలగూడెం ఎర్రకుంట మీదుగా జక్కలవారి గూడెం చెరువు నుండి మునుగోడు పెద్దచెరువుకి గల ఫీడర్ ఛానెల్‌ని మరమ్మత్తు చేపట్టి వాగు నుండి ఎక్కువ నీరు చెరువులలోకి వచ్చేలా వాగుకి అడ్డం బండ్ నిర్మాణం .
- మునుగోడు పెద్దవాగు నీటిని వృదా కాకుండా చేయటానికి సాధ్యమైన చిన్న చెరువుల నిర్మాణం చేపట్టి తద్వారా మండలంలోకి చాలా గ్రామాలలో భూగర్భ జలాల వృద్ధి .
- మునుగోడు నుండి దుబ్బకాలువ గ్రామానికి రోడ్డు నిర్మాణం, కచలాపురం నుండి మునుగోడు – నార్కట్‌పల్లి రోడ్డుని కలుపుతూ రోడ్డు నిర్మాణం.
- మండలంలోని అన్ని గ్రామాలకు లింక్ రోడ్ల నిర్మాణం.
- మండలంలో ప్రసిద్ధి గాంచిన చీకటిమామిడి రామలయానికి నల్లగొండ – చౌటుప్పల్ రోడ్ కలుపుతూ బిటి రోడ్డు

(కథనం కొనసాగింపు.. రేపటి సంచికలో)

## వరదప్రాంతాల్లో బండి సంజయ్ పర్యటన

### కలెక్టర్‌ను కలసి పరిస్థితులపై చర్చ



**కరీంనగర్, జూలై 12(సమ సమాజం):** వర్షాలతో నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కరీంనగర్ నియోజకవర్గం చర్ల భూత్కూర్ గ్రామంలో పర్యటించిన ఆయన.. వానల వల్ల జనం ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి అడిగితెలుసుకున్నారు. అనంతరం బండి సంజయ్ కరీంనగర్ కలెక్టర్ ఆర్ వీ కర్ణన్ ను కలిశారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో నెలకొన్న పరిస్థితులను సమీక్షించారు. వర్షాల వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో చేపట్టిన సహాయ కార్యక్రమాల గురించి బండి సంజయ్ కలెక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పరిస్థితి అదుపులోనే ఉందని, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని కలెక్టర్ వివరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సహాయకచర్యల్ని వేగవంతం చేయాలని బండి సంజయ్ సూచించారు.

## జూపార్క్‌ను ముంచెత్తిన వరదనీరు



**హైదరాబాద్, జూలై 12 (సమ సమాజం):** రాష్ట్ర వ్యాప్తంగా జోరు వానలు పడుతున్నాయి. భారీ వర్షాలతో హైదరాబాద్ లోని లోతట్టు జలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని నెహ్రూ జూపార్క్ కు కూడా వరద పోటెత్తింది. జూపార్క్ పక్కనే మీరాలం చెరువు ఉండగా..అది నిండడంతో పార్క్ లోకి నీరు చేరింది. భారీ వరద రావడంతో జూపార్క్ లోని సఫారీని మూసివేశారు. సఫారీ మాత్రమే మూసివుంటుందని.. మిగితా జూపార్క్ యథావిధంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. సందర్శకులు పార్క్ కు రావొచ్చని సూచించారు. కాగా నగర శివార్లలో ఉన్న ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ తో పాటు నగరం నడిబొడ్డున ఉన్న హుస్సేన్ సాగర్ నిండకుండలా మారాయి.

బుధ వారం, 13. 07. 2022 www.aksharavelugu.com సమ సమాజం 3

# ఆదివాసీ మహిళను వివస్త్రను చేస్తారా

ఇంత దారుణం జరుగుతున్నా స్పందించరా
అటవీ అధికారుల తీరుపై సిపిఐ ఆగ్రహం
మంచిర్యాల జిల్లా డీఎఫ్‌వో కార్యాలయ ముట్టడికి పిలుపు

**హైదరాబాద్, జూలై 12(సమ సమాజం):** మంచిర్యాల జిల్లాలో ఆదివాసీ మహిళను దారుణ పరిస్థితుల్లో స్టేషన్‌కు తరలించిన రేంజ్ ఆఫీసర్ రత్నాకర్ రావును వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. ఇలాంటి దారుణాలు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని అన్నారు. కోయపోచగూడం పోడులో ఆదివాసీ మహిళలపై అటవీ, పోలీస్ శాఖల దాడులను తీవ్రంగా ఖండించారు. అటవీ, పోలీస్ శాఖలు ఒక్కటై ఆదివాసీ మహిళలను వివస్త్రలను చేశారన్నారు. ఫారెస్ట్ అధికారుల దాడులకు నిరసనగా మంచిర్యాల జిల్లా డీఎఫ్‌వో కార్యాలయాన్ని బుధవారం 13న సీపీఐ ఆధ్వర్యంలో ముట్టడించనున్నట్టు ఆ పార్టీ ఇన్‌చార్జ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్‌రెడ్డి చెప్పారు. తోణం పోడు సమస్యలను పరిష్కరించాలన్నారు. మరోవైపు పోడు సమస్య పరిష్కరించాలని, ఆదివాసీలపై జరుగుతున్న దాడులు అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సోమవారం బంద్ చేపట్టి తమ నిరసనలు వ్యక్తం చేశారు. ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాలపై మరోదశ పోరాటానికి శ్రీకారం చుడుతామన్నారు. మంచిర్యాల జిల్లా కోయ పోచగూడెం ఆదివాసీ మహిళలపై అటవీ శాఖ అధికారులు దాడిచేయడం అమానుషమన్నారు. దాడుల వెనుక సీఎం కేసీఆర్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హస్తం ఉందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కావాలనే గిరిజనులపై కక్షగట్టి అడవి నుంచి బలవంతంగా వెళ్లగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి కోసం పోరాడుతున్న మంచిర్యాల జిల్లా కోయ పోచగూడెం ఆదివాసీ మహిళలను పోలీసులు, ఫారెస్ట్ ఆఫీసర్లు కొట్టారని, చీరలు లాగారని, చిత్రహింసలకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలపై ఫారెస్ట్ ఆఫీసర్ల దాడులు అమానుషమన్నారు. ప్రభుత్వం పోడు భూములకు పట్టాలిచ్చి వ్యవసాయ పథకాలన్నీ వర్తింపజేయాలన్నారు.

# సహకార కేంద్ర బ్యాంకులో 3.5 కోట్లు స్వాహా

నలుగురు ఉద్యోగులపై వేటు

**గుంటూరు, జూలై 12(సమ సమాజం):** ప్రత్తిపాడు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో 3.5 కోట్లు స్వాహా చేశారు. ఇందులో ప్రమేయం ఉందన్న అనుమానంతో సీఈవో కృష్ణవేణి నలుగురు ఉద్యోగులపై వేటు వేశారు. ఏజీఎం జయలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్‌లు అరుణకుమారి, బ్రాహ్మణి, క్యాషియర్ సాంశివరావును సస్పెండ్ చేశారు. అనంతరం నిధుల స్వాహా వ్యవహారంపై ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# లోన్‌యాప్ వేధింపులకు మహిళ ఆత్మహత్య

పోలీసులకు ఫిర్యాదు చేసిన భర్త

**గుంటూరు, జూలై 12(సమ సమాజం):** లోన్ యాప్ వేధింపులు తట్టుకోలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గుంటూరు జిల్లాలో చోటుచేసుకుంది. మంగళగిరి మండలం చిన్నకాకాని గ్రామానికి చెందిన బండపల్లి ప్రత్యూష ఇండియన్ బుల్స్, రూపెక్స్ యాప్స్ నుంచి రూ.20,000 లోన్ తీసుకుంది. రూ.20 వేల రుణానికి లోన్ యాప్స్ నిర్వాహకులు రూ. 2 లక్షల వరకు వసూలు చేశారు. అయినా ఇంకా డబ్బులు కట్టాలని, లేకుంటే ప్రైవేటు ఫోటోలు సోషల్ మీడియాలో పెడతామని కేటుగాళ్లు బెదిరించారు. రుణం తీర్చకపోతే బంధువులకు ఫోన్ చేసి చెప్తానని సైబర్ నేరగాళ్లు భయపెట్టారు. వాట్సాప్‌లో అసభ్యకర మెసెజ్‌లు పంపుతూ వేధింపులకు గురిచేశారు. దీంతో మనస్తాపం చెందిన ప్రత్యూష ఇంటిపైన ఉన్న ప్లెక్సీ హోర్డింగ్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్య చేసుకునే ముందు తల్లిదండ్రులకు, భర్తకు సెల్ఫీ వీడియో పంపింది. ఈ మేరకు ప్రత్యూష భర్త మంగళగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# శివసేన అనూహ్య నిర్ణయం

రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపదికి మద్దతు • గిరిజన మహిళగా ముర్ముని ఆదరిస్తామన్న ఉద్ధవ్ థాక్రే

**ముంబై, జూలై 12(సమ సమాజం):** ఎన్డీయే రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ముకు శివసేన అధినేత, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే తన మద్దతును ప్రకటించారు. గిరిజన మహిళ రాష్ట్రపతి కావడం సంతోషంగా ఉందన్నారు. శివసేన ఎంపీలు నాపై ఎలాంటి ఒత్తిడి తీసుకురాలేదు, కానీ వారు సూచించారు. వారి సూచనను వింటూ, రాష్ట్రపతి పదవికి ద్రౌపది ముర్ముకు మద్దతు ఇవ్వబోతున్నాం అని ఠాక్రే తెలిపారు. శివసేనకు చెందిన 18 మంది ఎంపీలలో 16 మంది ద్రౌపది ముర్ముకు మద్దతివ్వాలని ఉద్ధవ్ ఠాక్రేను కోరారు. ఈ మేరకు రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి ద్రౌపది ముర్మూకే మద్దతివ్వాలని తీర్మానించారు. ఎన్డీఏ అభ్యర్థిగా బరిలో దిగిన ద్రౌపదీ ముర్మూకే మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్టు ఆ పార్టీ అధినేత ఉద్ధవ్ ఠాక్రే అధికారికంగా ప్రకటించారు. రాష్ట్రపతి ఎన్నికల్లో ఆమెకు మద్దతు ఇవ్వాలని తనపై ఎలాంటి ఒత్తిడి రాలేదని.. తన పార్టీ ఎంపీలతో నిన్న మాతోశ్రీలో జరిగిన సమావేశంలోనూ వారెలాంటి ఒత్తిడి చేయలేదని స్పష్టంచేశారు. రాష్ట్రపతి పదవికి దేశంలోనే తొలిసారి ఒక ఆదివాసీ మహిళకు అవకాశం వచ్చిందని తన పార్టీలోని ఆదివాసీ నేతలు తనతో అన్నారని ఉద్ధవ్ తెలిపారు. వాస్తవానికి.. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఎన్డీయే నిలబెట్టిన ద్రౌపదీ ముర్మూకు తాము మద్దతు ఇవ్వాల్సి ఉండేది కాదని.. కానీ తమది అంత సంకుచిత మనస్తత్వం కాదని వ్యాఖ్యానించారు. ఉద్ధవ్‌ఠాక్రే ప్రైవేటు నివాసం మాతోశ్రీలో సోమవారం పార్టీ ఎంపీలతో జరిగిన సమావేశంలో ద్రౌపదికే మద్దతు ఇవ్వాలని ఎక్కువ మంది సభ్యులు కోరినట్టు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఒకట్రెండు రోజుల్లో తన నిర్ణయం వెల్లడిస్తానని తెలిపిన ఉద్ధవ్ ఠాక్రే.. శివసేన మద్దతు ద్రౌపదీ ముర్మూకే ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు మంగళవారం ప్రకటించారు. శివసేనకు లోక్‌సభలో మొత్తంగా 18మంది ఎంపీలు ఉండగా.. వీరిలో 15మంది ఎంపీలు నిన్నటి సమావేశానికి నేరుగా హాజరయ్యారు. అయితే, వారంతా ద్రౌపదీ ముర్మూకే మద్దతు ఇవ్వాలని ఠాక్రేను కోరినట్టు ఆ పార్టీ ఎంపీ గజానన్ కిరీట్కర్ మీడియాకు వెల్లడించారు. ద్రౌపది ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన వారు.. పైగా ఓ మహిళ కావడంతో ఆమెకే మద్దతు ఇవ్వాలని వారంతా అభిప్రాయపడినట్టు ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్ర జనాభాలో దాదాపు 10శాతం ఆదివాసీలు ఉన్నారు.మహారాష్ట్రలో ఇటీవల ఉద్ధవ్ ఠాక్రే సారథ్యంలోని మహావికాస్ అఘాడీ ప్రభుత్వాన్ని కూల్చివేయడంలో భాజపా కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఏక్‌నాథ్ శిందే శివసేన నుంచి తిరుగుబాటు చేయడం.. భాజపా మద్దతుతో కొత్త ప్రభుత్వం ఏర్పాటు వంటి కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో భాజపా సారథ్యంలోని ఎన్డీయే రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రతిపాదించిన ముర్మూ వైపే తమ పార్టీ ఎంపీలు మొగ్గు చూపడంపై ఉద్ధవ్ ఎలాంటి నిర్ణయం ప్రకటిస్తారనే అంశం చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో ద్రౌపదికే శివసేన మద్దతు ఇస్తున్నట్టు ఆయన ప్రకటించడం గమనార్హం. ఈ నెల 18న రాష్ట్రపతి ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో ఎన్డీయే తరఫున ద్రౌపదీ ముర్మూ.. విపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా యశ్వంత్ సిన్హా బరిలో నిలిచిన విషయం తెలిసిందే.

# సంక్షోభం నుంచి లంక గట్టెక్కేనా

(మొదటి పేజీ తరువాయి..) అది చెప్పిన ప్రాజెక్టులన్నింటికీ తలూపి అసలుకే ఎసరు తెచ్చారు. అలా కొన్ని ప్రాజెక్టులు ఇప్పుడు దేశానికి భారంగా మారాయి. పర్యాటకం మీదా, తేయాకు వంటి ఎగుమతులమీదా ఆధారపడిన శ్రీలంకను ఈస్టర్ బాంబు పేలుళ్ళ ఘటన పెద్ద దెబ్బతీసింది. అంతర్జాతీయ పర్యాటకులను భయపెట్టిన ఆ ఘటన అనంతరం, కరోనా మహమ్మారి వచ్చి ఏకంగా చావుదెబ్బ కొట్టింది. ఆ తరువాత సేంద్రీయ వ్యవసాయం వైపుకు ఒక్కసారిగా మళ్ళిపోవడం, అందులో భాగంగా విదేశాలనుంచి ఎరువులు, రసాయనాల దిగుమతులను ఏకంగా నిషేధించడంతో, వ్యవసాయ ఉత్పత్తి ఒకేసారి మూడో వంతుకు పడిపోయింది. ఇన్ని తప్పటడుగులమధ్య చేజేతులా సృష్టించుకున్న ఆర్థిక సంక్షోభాన్ని రణిల్ ఏ మేరకు పరిష్కరించగలుగుతారో చూడాలి. లంకను ఇప్పటికే అంతోఇంతో ఆదుకుంటున్న భారతదేశం రణిల్‌కు అండగా సహాయసహకారాలు అందించడం వల్ల దేశ ప్రజలు భారత్‌కు కృతజ్ఞతలు చెబుతున్నారు. మరోవైపు అధ్యక్షుడు గొటబాయ రాజపక్స, ప్రధాని రణిల్ విక్రమసింఘె తమ పదవులకు రాజీనామా చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో.. దేశంలో నెలకొన్న రాజకీయ అనిశ్చితికి తెరదించేందుకు శ్రీలంకలోని వివిధ రాజకీయ పార్టీలు గత రెండు రోజులుగా చేస్తున్న ప్రయత్నాలు సోమవారం ఒక కొలిక్కి వచ్చాయి. వచ్చే వారం పార్లమెంటులో నూతన అధ్యక్షుడిని ఎన్నుకోనున్నట్లు స్పీకర్ మహీంద యాపా అబేవర్ధన ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని అంతకు ముందు జరిగిన అఖిలపక్ష సమావేశంలో వివిధ పార్టీ నేతలు కలిసి తీసుకున్నారు. బుధవారం (జూన్ 13న) గొటబాయ తన అధ్యక్ష పదవికి రాజీనామా చేయనున్నారు. ఈ విషయాన్ని ప్రధాని రణిల్ విక్రమసింఘెకు కూడా అధికారికంగా తెలిపారు. అధ్యక్ష భవనంపై దాడి అనంతరం గొటబాయ అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. రాజపక్స రాజీనామా సమర్పించగానే, అధ్యక్ష ఎంపిక పక్రియ ప్రారంభమవుతుంది. 15న పార్లమెంటు సమావేశమై.. అధ్యక్ష పదవి ఖాళీని అధికారికంగా ప్రకటిస్తుంది. 19న నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 20న పార్లమెంటులో నూతన అధ్యక్షుడిని ఎన్నిక జరుగుతుంది.ఈ నేపథ్యంలో.. అధ్యక్ష పదవికి పోటీ చేయనున్నట్లు ప్రతిపక్ష నేత సజిత్ ప్రేమదాస ప్రకటించారు. గొటబాయ రాజపక్స అధికారం నుంచి దిగిన వెంటనే అధ్యక్ష స్థానానికి పోటీ చేస్తానని పేర్కొన్నారు. ఆయన పార్టీ సమగి జన బలవెగయ (ఎస్‌జేబీ) ఇప్పటికే ఇతర పక్షాలతో ఈ అంశంపై చర్చలు జరిపింది. సజిత్ మాట్లాడుతూ .. 'ఒక వేళ ఖాళీ ఏర్పడితే నేను నామినేషన్ వేసేందుకు సిద్ధం. ఇప్పటికే ఈ అంశంపై పార్టీలో, మిత్రపక్షాలతో చర్చించాం. మేము ప్రజలను మోసం చేయడానికి కాకుండా శ్రీలంకను ఈ సంక్షోభం నుంచి బయటపడేయటానికి అనుకున్న ప్రణాళికను ముక్కుసూటిగా అమలు చేస్తామని వెల్లడించారు.

# ఎపిలో రాష్ట్రపతి అభ్యర్థి ముర్ముకు సంపూర్ణ మద్దతు

- అధికార వైసిపి,విపక్ష టిడిపిల మద్దతు
- ముర్ముతో విజయవాడలో టిడిపి ఆత్మీయ సమావేశం
- ఆమెకు సంపూర్ణ మద్దతుపలికిన చంద్రబాబు
- టిడిపి ఆత్మీయ సభలో పాల్గొన్న బిజెపి నేతలు



**అమరావతి, జూలై 12(సమ సమాజం):** రాష్ట్రంలో ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా ఆమెకు అధికార వైసిపితో పాటు విపక్షటిడిపి మద్దతు కూడా దక్కింది. మంగళవారం ఉదయం విజయవాడ చేరుకున్నముర్మకు గనస్వాగతం లభించింది. అనంతరం సిఎం జగన్ ఆమకు మద్దతుప్రకటించారు. తరవాత తాజ్ గేట్ వే హోటల్ వద్ద ద్రౌపది ముర్మకు తెదేపా అధినేత చంద్రబాబు స్వాగతం పలికారు. అనంతరం తెదేపా ఎమ్మెల్యేలను ద్రౌపది ముర్మకు చంద్రబాబు పరిచయం చేశారు. ఆమెకు టిడిపి మద్దతు ప్రకటించింది. రాష్ట్రపతి ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపినందుకు ముర్ము కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, సీఎం రమేష్, ఎంపి జీవీఎల్, మాధవ్, వాకాటి నారాయణరెడ్డితో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్మును చంద్రబాబు సత్కరించారు. రాష్ట్రపతి అభ్యర్థి ఎన్నికలో భాగస్వామ్యం కావడం అందరి అదృష్టం అని టిడిపి అధినేత చంద్రబాబు అన్నారు. పేద కుటుంబంలో జన్మించిన ఆదివాసీ మహిళ ద్రౌపది ముర్ము. మారుమూల గ్రామంలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగారు. సామాజిక న్యాయం కోసం ముర్మును బలపరిచాలని తెదేపా నిర్ణయించింది. రాష్ట్రపతి అభ్యర్థిగా ముర్మును ఎంపిక చేసిన మోదీని అభినందిస్తున్నాను. గతంలో అబ్దుల్ కలాం, రామ్‌నాథ్ కోవింద్ ఎన్నిక వేళ సైతం తెదేపా మద్దతు తెలిపిందని చంద్రబాబు గుర్తు చేశారు. ప్రజాస్వామ్యంలో భారత్ ఎంతో పరిణతి చెందింది. భారత్ అభివృద్ధిలో వాజ్‌పేయీ ప్రముఖ పాత్ర పోషించారని అని సోము వీర్రాజు అన్నారు. వాజ్‌పేయీ వచ్చిన తర్వాతే ఎస్టీకి మంత్రివర్గంలో స్థానం లభించింది. సమాజానికి దూరంగా ఉన్న వ్యక్తుల గురించి ఆలోచించిన వ్యక్తి వాజ్‌పేయ్. అనంతరం ఇనాళ్లకు మళ్లీ ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థిగా ముర్మును నిలపడం రాజకీయ అవసరం కాదు. కేవలం సామాజిక బాధ్యత అని సోము వీర్రాజు అన్నారు. రాష్ట్రపతి అభ్యర్థిగా ముర్ము నిలవడం సంతోషంగా ఉందని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అన్నారు. ఓ ఆదివాసీ మహిళ రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక కావడం సంతోషకరమైన విషమన్నారు. సామాజిక న్యాయం కోసం ఏర్పాటు చేసిన పార్టీ తెదేపా అని.. ఎంతో మందికి ఉన్నత పదవులు కూడా ఇప్పించిందన్నారు. ఎమ్మెల్యే, మంత్రిగా, గవర్నర్‌గా ముర్ముకు అశేష అనుభవం ఉంది.. అలాంటి వ్యక్తికి మద్దతు తెలపడం అందరి అదృష్టమని అచ్చెన్నాయుడు తెలిపారు. ద్రౌపది ముర్ము వివిధ హోదాల్లో పని చేశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. స్వాతంత్ర్యం తర్వాత ఎక్కువ కాలం మహిళా గవర్నర్‌గా చేసిన వ్యక్తి ముర్ము అని కిషన్ రెడ్డి అన్నారు. దేశంలో తొలిసారిగా గిరిజన మహిళ రాష్ట్రపతి అభ్యర్థిగా నిలుస్తోందని.. దేశవ్యాప్తంగా 42 పార్టీలు ముర్ముకు మద్దతు తెలుపుతున్నాయన్నారు. రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ముని టీడీపీ ఆత్మీయ సమావేశానికి పిలవడంపై బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. నాలుగు సంవత్సరాల అనంతరం టీడీపీ, బీజేపీ నేతలు మాటామంతి కలిపారు. ద్రౌపది ముర్మును ఎన్‌డీఏ అభ్యర్థిగా నియమించడంపై టీడీపీ, బీజేపీ నేతలు చర్చించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ మిజోరం రెండు రాష్ట్రాలు మాత్రమే పూర్తిగా ద్రౌపది ముర్ముకు మద్దతు తెలిపాయి. రాష్ట్రపతి ఎన్నికల ప్రచారంలో





భాగంగా ఎన్డీఏ అభ్యర్థి ద్రౌపదీ ముర్ము మంగళవారం ఏపీకి వచ్చారు. తొలుత మంగళగిరిలోని సీకే కన్వెషన్ సెంటర్‌కు వెళ్లి... తనకు మద్దతివ్వాలని వైసీపీ నేతలను కోరారు. అనంతరం విజయవాడలో తాజ్ గేట్ వే హోటల్‌కు చేరుకున్న ముర్మకు చంద్రబాబు స్వాగతం పలికారు. గేట్‌వే హోటల్‌లో చంద్రబాబుతో బీజేపీ నేతల భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబును కలిసిన సోమువీర్రాజు, సీఎం రమేశ్, జీవీఎల్, ఎమ్మెల్సీలు వాకాటి నారాయణరెడ్డి, మాధవ్ కలిశారు. రాష్ట్రపతి అభ్యర్థికి ముర్మకు మద్దతు ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబుతో జీవీఎల్, సోమువీర్రాజులు మాటామంతి కలిపారు. బాగా బరువు తగ్గారని చంద్రబాబుతో జీవీఎల్ అనగా, గతంలో 70 కిలోలకు పైగా ఉండేవాడిని, ఇప్పుడు 60 కిలోలకు పైబడి ఉన్నానని నవ్వుకుంటూ చంద్రబాబు సమాధానం ఇచ్చారు.

# రాష్ట్రంలో డ్రగ్స్ నిరోదానికి కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి..)మహేందర్ రెడ్డి తెలిపారు. డ్రగ్స్ విక్రయించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నామని, పీడీ చట్టాన్ని కూడా విధిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్తా, సీఐడీ అదనపు డీజీ గోవింద్ సింగ్, నార్కోటిక్ కంట్రోల్ బోర్డు జాయింట్ డైరెక్టర్ పీ అరవిందన్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్ డైరెక్టర్ జనరల్ డీపీ నాయుడు, నార్కోటిక్ కంట్రోల్ బోర్డు దక్షణాది రాష్ట్రాల డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ముత్తా అశోక్ జైన్, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వి, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఐజీ రాజేష్ కుమార్, ఎక్సైజ్ శాఖ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు హాజరయ్యారు.

# నగరంలో వర్షాలపై మేయర్ సమీక్ష

అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు

**హైదరాబాద్, జూలై 12(సమ సమాజం):** రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. భారీ వర్షాలకు హైదరాబాద్ లోని లోతట్టు ప్రాంతాలు జలమయమవగా..ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో వర్షాలపై జోనల్ కమిషనర్లతో మేయర్ విజయలక్ష్మి సమీక్ష నిర్వహించారు. నగరంలో కురుస్తున్న వర్షాలు, క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితిని అధికారులను అడిగి తెల్సుకున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మేయర్ ఆదేశించారు. డ్రైనేజీల వద్ద చెత్త నిలవకుండా చర్యలు తీసుకోవడంతో పాటు కరెంట్ పోల్స్, నాలాల పరిసరాల్లోకి ప్రజలు వెళ్లకుండా చూడాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు వస్తే..వెంటనే బల్దియ కంట్రోల్ రూం నెం. 040--21111111కు కాల్ చెయ్యాలని మేయర్ సూచించారు. నగరవాసుల దగ్గర నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# వరదప్రాంత రైతులను తక్షణమే ఆదుకోవాలి

పంటనష్టపోయిన వారికి 15వేలు పరిహారం ఇవ్వాలి
సిఎం కెసిఆర్‌కు బహిరంగ లేఖరాసిన రేవంత్

**హైదరాబాద్, జూలై 12(సమ సమాజం):** రాష్ట్రంలో భారీ వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం కేసీఆర్ కు బహిరంగ లేఖ రాశారు. వర్షాల కారణంగా జరిగిన పంట నష్టాన్ని తక్షణం అంచనా వేసి ఎకరాకు రూ.15వేల చొప్పున పరిహారం చెల్లించాలని రేవంత్ అందులో పేర్కొన్నారు. కొత్తగా పంటలు వేయడానికి విత్తనాలు, ఎరువులు, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి పంటల బీమా పథకం అమలుకు తక్షణ చర్యలు తీసుకోవాలని రేవంత్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వరదలు, అకాల వర్షాలకు పంట నష్టపోవడం, పరిహారం అందకపోవడం పరిపాటిగా మారిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో ప్రకృతి విపత్తులకు పంటలు దెబ్బతిని రైతులు కుదేలవుతున్నా వారిని ఆదుకునే పథకమేదీ ప్రభుత్వం అమలు చేయకపోవడం అన్నదాతల పట్ల కేసీఆర్‌కు ఉన్న కపట ప్రేమకు నిదర్శనమని అన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన నుంచి తప్పుకున్న ప్రభుత్వం ప్రత్యామ్నాయ పథకాల ద్వారా వారిని ఆదుకోకపోవడం దురదృష్టకరమని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు.

# అమలాపురం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**అమలాపురం, జూలై 12(సమ సమాజం):** ఏపీలో వర్షాలు దంచికొడుతున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. చెరువులు వర్షం నీటితో నిండిపోతున్నాయి. జలాశయాలు నిండుకుండలా దర్శన మిస్తున్నాయి. నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. జలాశయాలు నిండిపోతుండడంతో నీటిని దిగువకు వదులుతున్నారు. పరివాహక ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గోదావరి వరద సహాయక చర్యల కోసం అమలాపురం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ (08856-293104) ఏర్పాటు చేశారు. మరో రెండో చోట్ల కూడా కంట్రోల్ రూమ్‌లను అందుబాటులో ఉంచారు. వరద సహాయక చర్యల కోసం అమలాపురం ఆర్డీవో కంట్రోల్ రూమ్ (08856-233208), రామచంద్రపురం ఆర్డీవో కంట్రోల్ రూం (08857-245166)కు ఫోన్ చేయాలని కోరారు.




# చలన చిత్రం



## నిర్మాతగా మారుతున్న సాయిపల్లవి ?

ఫిదా బ్యూటీ సాయిపల్లవి త్వరలో నిర్మాతగా మారనుందా..! తాజాగా తన మాటలు వింటే అదే అనిపిస్తోంది. ప్రేమమ్ సినిమాతో హీరోయిన్‌గా టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన సాయి పల్లవి..మంచి పర్ఫార్మర్‌గా పాపులరైంది. ఇప్పుడు తెలుగులో తకున్న క్రేజ్ అంతా ఇంతా కాదు. సాయిపల్లవి ఒక సినిమా చేస్తోంది అంటే ఆ కథలో ఏదో కొత్తదనం ఉందనే అందరూ భావిస్తున్నారు. ఫ్లాప్స్ వస్తున్నా కూడా తన క్రేజ్ మాత్రం అసలు తగ్గలేదు. ఇటీవలే రానాతో కలిసి నటించిన విరాట పర్వం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఫలితం ఎలా ఉన్నా సాయి పల్లవి మాత్రం ఎప్పటి లాగానే తన పర్ఫార్మెన్స్‌తో అన్నీ వర్గాల ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఇక త్వరలో గార్గి సినిమాతో ప్రేక్షకులను పలకరించబోతుంది. లేడీ ఓరియేంటెడ్ చిత్రంగా తెరకెక్కిన ఈ సినిమా తమిళంతో పాటు తెలుగు, ఇతర భాషలలో విడుదల చేస్తున్నారు. గౌతమ్ రామచంద్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్ర కథ అంతా సాయిపల్లవి చుట్టూనే తిరుగుతుందట. ఇక ఫీమేల్ సెంట్రిక్ మూవీ కావడంతో సాయి పల్లవినే ప్రమోషన్స్‌లో ఎక్కువగా పాల్గొంటోంది. ఈ సందర్భంగా తాను..'గార్గి సినిమాకి సమర్పకురాలిగా నా పేరు వేస్తామని నిర్మాతలు అన్నారు. నా సినిమాను నేను సమర్పించుకోవడం ఏమిటి? నా దగ్గరికి మంచి స్క్రిప్ట్ వచ్చినప్పడు.. ఆ సినిమాను నేను నిర్మిస్తే బాగుంటుంది.. అనిపించినప్పడు పూర్తి స్థాయిలో నిర్మాతగా మారతాను' అని చెప్పకొచ్చింది.దీనిని బట్టి చూస్తే ఎవరైనా మంచి కథతో తనని మెప్పిస్తే ఖచ్చితంగా నిర్మాణ రంగంలో దిగడం ఖాయమని అర్థమవుతుంది. మరి తనని మెప్పించే కథ ఎవరిస్తారో..ఆ సినిమా ఎప్పడు ప్రకటిస్తారో గానీ సోషల్ మీడియాలో మాత్రం ప్రస్తుతం సాయి పల్లవి మాటలు వైరల్ అవుతున్నాయి. కాగా, గార్గి చిత్రం ఈ నెల 15వ తేదీన విడుదల చేస్తున్నారు.






## ఏజెంట్ తరవాత అఖిల్‌తో దిల్‌రాజ్ తో సినిమా

అక్కినేని అఖిల్ హీరోగా దిల్‌రాజు నిర్మాతగా సినిమా చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్టుగా తాజా సమాచారం. ఈ సినిమాకి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన బ్లాక్ బస్టర్ మూవీ టైటిల్‌ను పెట్టాలని మేకర్స్ ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. అఖిల్ హీరోగా టాలీవుడ్ అగ్ర నిర్మాత దిల్ రాజు ఓ చిత్రాన్ని నిర్మించనున్నారట. ఈ నేపథ్యంలో ఈ మూవీకి గతంలో పవన్ కళ్యాణ్, ప్రీతి జింగానియా జంటగా నటించిన తమ్ముడు టైటిల్‌ను పెట్టాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. ఇప్పటికే, పవన్ డైహార్ట్ ఫ్యాన్ తొలిప్రేమ సినిమాలో పాటను రీమిక్స్ చేసిన సంగతి తెలిసిందే. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కూడా పవన్ నటించిన 'బాలు' సినిమాలో పోషించిన పాత్రనే 'గని' అని తన సినిమాకు పెట్టాడు. ఈ క్రమంలోనే ఇప్పుడు అఖిల్ సినిమాకు 'తమ్ముడు' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారట. ఇక ఈ చిత్రాన్ని వేణు శ్రీరామ్ డైరెక్ట్ చేయనున్నాడు. త్వరలో ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించనున్నట్టు సమాచారం.




## రాకెట్రీ థియేటర్‌లో గొడవ

### చిత్రం నిలిపివేయడం తగదన్న మాధవన్

స్టార్ హీరో మాధవన్ నటించిన లేటెస్ట్ మూవీ 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్'. ప్రముఖ ఇస్రో శాస్త్రవేత్త నంబి నారాయణన్ నిజ జీవితంలో జరిగిన సంఘటన ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. స్వయంగా మాధవన్ దర్శకత్వం వహించి నటించిన ఈ సినిమా జూలై 1న విడుదలైంది. ప్రస్తుతం బాక్సాఫీసు వద్ద ఈ చిత్రం పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది. విమర్శకుల నుంచి సైతం ప్రశంసలు అందుకుంటుంది. ఇందులో మాధవన్ యాక్టింగ్, డైరెక్షన్‌కు ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. గొప్ప సినిమా చేశావంటూ ఆయనను పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. ఇదిలా ఉంటే కోల్‌కతాలోని ఓ థియేటర్లో రాకెట్రీ మూవీ ప్రదర్శనను మధ్యలో నిలిపివేయాల్సిన పరిస్థితి నెలకొంది. షో మొదలైన కొద్ది సమయం తర్వాత ఫ్యాన్స్‌కు, థియేటర్ యాజమాన్యానికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో మూవీ ప్రదర్శనను మధ్యలోనే నిలిపివేశారు. అనంతరం ఈ సంఘటనపై మాధవన్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. కాస్తా నెమ్మదించాలని ఫ్యాన్స్‌ను కోరాడు. ఈ సందర్భంగా థియేటర్లో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వీడియోను కూడా మాధవన్ షేర్ చేశాడు. ఈ వీడియోలో కొంతమంది ఆడియన్స్.. థియేటర్ యాజమాన్యంతో గోడవ పడుతూ కనిపించారు. చూస్తుంటే వారిమధ్య పెద్ద వాగ్వాదమే చోటు చేసుకున్నట్లు కనిపిస్తోంది. దీంతో మాడీ ట్వీట్ చేస్తూ... 'ఏం జరిగిందో తెలియదు. మీరు గొడవ పడటం వెనక అసలైన కారణమే ఉండోచ్చు. కానీ మీరు కాస్తా శాంతించండి. ఇతరుల పట్ల ప్రేమతో వ్యవహరించండి. ఇది నా విజ్ఞప్తి. షో తిరిగి మొదలవుతుంది' అంటూ రాసుకొచ్చాడు.

## ది గ్రే మ్యాన్‌తో హాలీవుడ్ ఎంట్రీ ఇస్తోన్న ధనుష్



తన సహజమైన నటనతో దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న నటుడు ధనుష్. ప్రస్తుతం ఆయన.. 'ది గ్రే మ్యాన్' చిత్రంతో హాలీవుడ్ అరంగేట్రం చేస్తున్నారు. తాజాగా ఈ సినిమాలోని ఆయన పాత్రకు సంబంధించిన ఓ గ్లింప్స్ విడుదుల చేశారు. ఇందులో ధనుష్ అదిరిపోయే ఫైట్ చేస్తూ కనిపించారు. తమిళ స్టార్ హీరో ధనుష్ వరుసపెట్టి సినిమాలు చేస్తూ జోరు మీద ఉన్నారు. తమిళ చిత్రాల్లోనే కాదు.. టాలీవుడ్, బాలీవుడ్, హాలీవుడ్ అంటూ దూసుకెళ్తున్నారు. ఇప్పడాయన నటిస్తున్న తొలి హాలీవుడ్ మూవీ 'ది గ్రే మ్యాన్'. రుసో బ్రదర్స్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ మూవీటీమ్ ఒక్క రోజు గ్యాప్‌లోనే ఫ్యాన్స్‌కు రెండు సర్‌ప్రైజలు ఇచ్చింది. ఇండియాకు దర్శకులు రుసో బ్రదర్స్ వస్తున్నట్లు తెలిపిన చిత్రబృందం.. మంగళవారం సినిమాలోని ధనుష్‌కు సంబంధించిన ఓ స్పెషల్ వీడియోను రిలీజ్ చేసింది. దీనిని ధనుష్ సోషల్‌మీడియాలో పోస్ట్ చేయగా.. అది వైరల్?గా మారింది. 56 సెకన్ల నిడివి ఉన్న ఈ వీడియోలో ఆయన అదిరిపోయే యాక్షన్? సీన్?లో కనిపించారు. ఇద్దరు హాలీవుడ్ యాక్టర్స్‌తో ఫైట్ చేస్తూ కనిపించారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA, Printed at Panidhar **PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**, RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in